క్లుప్తంగా

పీఠంలో రాట ముహూర్తం పూజలు


పీఠంలో రాట మంచి పూజలు చేస్తున్న పీఠం ప్రతినిధులు, భక్తులు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో వచ్చే నెల మూడో తేదీ నుంచి ప్రారంభమయ్యే శరన్నవరాత్ర ఉత్సవాలకు శుక్రవారం పందిరి రాట ముహూర్తం పూజలు చేశారు. ఉదయం 10.17 గంటలకు పీఠం వద్ద పందిరి వేసేందుకు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, వాడ్రేవు వేణుగోపాల్ తదితరులు మాట్లాడుతూ పీఠంలో 53వ శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. రాట మంచి పూజల్లో పీఠం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

మండపేటలో అన్నదానం


భక్తులకు అన్న ప్రసాదాలను వడ్డిస్తున్న మహిళలు

మండపేట: పట్టణంలోని రావులపేట గంగమళ్ల వారి వీధిలో పెద్ద ఎత్తున అన్నసంతర్పణ నిర్వహించారు. స్థానికంగా ఉన్న రామచంద్రుడు కాలువ గట్టుపై నెలకొల్పిన విజయ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నదానంలో 3500 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మహిళలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొని సేవలందించారు. ఈ కార్యక్రమంలో తెగడా సత్తిబాబు, గంగుమళ్ళ నాగబాబు, గంగుమళ్ల సురేష్, గుమ్మడి ప్రకాష్, అడ్డగళ్ల స్వరూప్, దెయ్యాల రాజేష్, దుగ్గిరాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈపీడీసీఎల్ ఏఈగా వెంకటరమణ


బాధ్యతలు స్వీకరించిన ఏఈ వెంకటరమణను సత్కరిస్తున్న సిబ్బంది

రామచంద్రపురం రూరల్: మండలంలోని రామచంద్రపురం డివిజన్ ద్రాక్షారామ ఏపీఈపీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజినీర్‌గా మేడిశెట్టి వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ద్రాక్షారామ సెక్షన్ ఆఫీసులో ఆ శాఖ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. రామచంద్రపురం టౌన్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడికు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన శీలం యేసురాజు ముమ్మిడివరం బదిలీపై వెళ్లారు. బదిలీపై వెళుతున్న శీలం యేసురాజు, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణలను ద్రాక్షారామ, రామచంద్రపురం సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఈ నజీర్ ఖాన్, ఫోర్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు మరువలేనివి


కొంకుదురులో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బిక్కవోలు: దేశ స్వాతంత్ర్యం కోసం, సమాజంలో మూఢనమ్మకాల నిర్మూలనకు మహానుభావుల చేసిన త్యాగాలు మరువలేనివని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. భగత్ సింగ్ జయంతి, రాజా రామ్మోహన్‌రాయ్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పాఠశాలలో వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ తన ప్రాణాలను అర్పించాడన్నారు. 18వ శతాబ్దం ప్రారంభంలోనే రాజా రామ్మోహన్‌రాయ్ మూఢనమ్మకాలపై పోరాటం చేశారని, మహిళల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఉపాధ్యాయులు మేడపాటి లక్ష్మణరెడ్డి, పడాల ఈశ్వరరెడ్డి, వలీషా, సుధాకరరెడ్డి, సత్యనారాయణ చౌదరి, శిరీష పాల్గొన్నారు.

రొయ్యో మొర్రో!

- ఆక్వా సాగుకు వైరస్ బెడద
- వర్షాలకు వ్యాధుల బారిన పడి తేలిపోతున్న రొయ్యలు
- నియోజకవర్గంలో 15 వేల ఎకరాల్లో ఆక్వా సాగు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు


కాజులూరులో వైరస్ భయంతో తక్కువ సైజులోనే రొయ్యలను పట్టుబడి చేస్తున్న రైతులు

కాజులూరు: అధిక వర్షాలు ఆక్వా రంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. గత రెండు నెలలుగా అల్పపీడనం, వాయుగుండం, వరుస తుపానుల ప్రభావంతో వర్షాలు పడుతూనే ఉన్నాయి. దీనికి తోడు వాతావరణంలో మార్పుల కారణంగా రొయ్యలకు వైరస్ సోకి వ్యాధుల బారిన పడుతున్నాయి. ఫలితంగా ఆక్వా రైతులు నష్టాలు చవిచూస్తున్నారు.

వెనామీకి పెరుగుతున్న వ్యాధులు

గతంలో రైతులు టైగర్ రొయ్యలను సాగుచేసేవారు. ఈ రకం రొయ్యలకు వైరెస్ ఎక్కువగా వస్తుండటంతో నియోజకవర్గంలోని అనేక ఎకరాల్లో రైతులు గత కొన్నేళ్లుగా వెనామీ రొయ్యలను పెంచుతున్నారు. పెట్టుబడులలో పెద్దగా వ్యత్యాసం లేకపోయినా వ్యాధులను వెనామీ తట్టుకుంటుందన్న ఆక్వా టెక్నీషియన్ల సూచనలతో ఈ సాగు చేపట్టారు. అయితే ప్రస్తుతం ప్రతికూల వాతావరణ పరిస్థితులకు వెనామీ కుడా వ్యాధుల బారిన పడుతున్నాయి. దీంతో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

నియోజకవర్గంలో...

నియోజకవర్గంలోని కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల పరిధిలోని గ్రామాల్లో సుమారు 15 వేల ఎకరాల్లో రొయ్యల చెరువులు ఉన్నాయి. రైతులు కౌంట్‌కు రాకుండానే వందలాది ఎకరాల్లో చిన్న సైజులో రొయ్యలను పట్టేస్తున్నారు. ఎండలు, పొడి వాతావరణం ఉంటే రొయ్యలు ఆరోగ్యంగా పెరిగి రైతులకు మంచి ఆదాయాన్ని తెచ్చిపెడతాయి. తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ఇటీవల వాతావరణం ఎల్లప్పుడూ మేఘాలు కమ్ముకుని ఉండటంతో ప్రతికూల వాతావరణం ఏర్పడి ఆక్వా సాగుకు నష్టం వాటిల్లుతోంది. చెరువు నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గిపోవడం, పీహెచ్‌లు పెరిగిపోవటం తదితర కారణాలతో వ్యాధులు సంభవించి సీడ్ వేసిన 20 రోజులకే రొయ్యలు వైరెస్ బారిన పడుతున్నాయి. ప్రస్తుతం వాతావరణ మార్పులతో ముఖ్యంగా వైట్‌స్పాట్, రెడ్‌గ్రిల్ వంటి వైరెస్‌లు సోకుతున్నాయని రైతులు చెబుతున్నారు. 50 శాతం పైబడి చెరువుల్లో ఈ ఏడాది పూర్తిస్థాయి కౌంట్‌కు రాకుండా రొయ్య వైరెస్ బారిన పడుతోంది.


గొల్లపాలెంలో అతి చిన్న కౌంట్‌లో పట్టుబడి పట్టిన రొయ్యలు


మొగలిపాలెంలో ఖాళీగా ఉన్న రోయ్యల చెరువులు

కౌంట్‌కు రాకుండానే..

రొయ్యల బరువు కేజీకి 80 నుంచి 70 వరకూ తూగే దశలో పట్టుబడి పట్టాల్సి వస్తే రైతుకు కాస్త మేత పెట్టుబడులైనా కలిసి వస్తాయి. 60 నుంచి 40 కౌంట్‌కు వస్తే రైతు లాబాల బాట పడతాడు. 30 కౌంట్ ధర ప్రస్తుతం రూ.430 వరకూ ఉంది. ఈ దశ వరకూ పంట సాగితే రైతు సిరులు పొందినట్టే. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో నెల వ్యవధిలోనే రొయ్యలు వైరెస్ వ్యాధి బారిన పడుతుండగా అధిక శాతం రైతులు 100 కౌంట్‌కు లోపే పట్టుబడి పట్టాల్సి వస్తోంది. చెరువుల్లో రొయ్యలకు వైరెస్ లక్షణాలు కలిపించిన వెంటనే పట్టుబడి పట్టాలి. లేదంటే నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో రైతులు వ్యాధులను గుర్తించగానే చెరువుల్లో రొయ్యలను పట్టి వచ్చిన రేటుకు అమ్ముకుంటున్నారు. నియోజకవర్గంలో సుమారు 8 వేల ఎకరాల్లో అక్వా సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకూ ఎకరానికి రూ.10 లక్షలు పైబడి నష్టం వాటిల్లింది. దీంతో మరోసారి పంట వెయ్యాలా...! వద్దా..? అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు.

తీవ్రంగా నష్టపోతున్నాం



ప్రస్తుత వర్షాకాలంలో రొయ్యలు వ్యాధుల బారిన పడటంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ముఖ్యంగా వైట్‌స్పాట్ వైరస్ కారణంగా రొయ్య తలపై తెల్లమచ్చల వ్యాధి సోకి చనిపోతున్నాయి. వర్షాల సమయంలో వైట్‌స్పాట్ వైరస్ ఒక చెరువు నుంచి మరొక చెరువుకు వేగంగా వ్యాప్తి చెందుతుంది. ఒక చెరువుకు వైట్‌స్పాట్ వైరస్ సోకితే కొన్ని రోజుల్లోనే ఆ ఏరియాలోని చెరువులన్నీ దెబ్బతింటున్నాయి.

పిల్లి కృష్ణమూర్తి, ఆక్వా రైతు, కుయ్యేరు

తక్కువ కౌంట్‌లోనే పట్టుబడి



రొయ్యలు వ్యాధుల బారిన పడటంతో తక్కువ కౌంట్‌లోనే పట్టుబడి పట్టాల్సి వస్తోంది. రొయ్యలు కనీసం 100 కౌంట్ వరకూ ఎదిగితే వచ్చే ఆదాయం సీడ్, మేత ఖర్చులకు వస్తుంది. ఎక్కువగా 150 లేదా 200 కౌంట్‌లలో పట్టుబడి జరుగుతుండటంతో కూలీల ఖర్చుల సైతం రావడం లేదు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం.

పితాని సుబ్రహ్మణ్యం, ఆక్వా రైతు, తణుకువాడ

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం కృష్ణమూర్తి తదితరులు

కాజులూరు: రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు విద్యార్థులు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు జేమ్స్ రవి సుందర్‌కొర్ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఎంపికైన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ పోటీల్లో భాగంగా కాకినాడలో ఇటీవల రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక జరిగిందన్నారు. అండర్-14 బాలుర విభాగంలో తమ పాఠశాలకు చెందిన పి.శ్రీసృజన్, బాలికల విభాగంలో ఆర్.కుసుమదుర్గ, ఎల్ కీర్తి ఉత్తమ ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్టు తెలిపారు. అండర్-17 బాలుర విభాగానికి బీవీవీ సత్యనారాయణ, బాలికల విభాగానికి కొప్పిశెట్టి సత్యలక్ష్మీదుర్గ, కోన వీరవెంకటలక్ష్మి ఎంపికయ్యారన్నారు. వీరు వచ్చే నెలలో అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా పార్వతీపురంలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా తరపున పోటీపడతారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ కొర్, నాగలక్ష్మిలను స్కూల్ హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి, విద్యాకమిటీ చైర్మన్ పద్దరాజు, పాఠశాల సిబ్బంది, గామ నాయకులు అభినందించారు.


రామచంద్రపురంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న జీవీ రావు తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలకు మోడరన్ విద్యార్థులు

రామచంద్రపురం: పట్టణంలోని మోడరన్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థల అధినేత జీవీ రావు శుక్రవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన కె.హర్ష, జి.రామదుర్గా ప్రసాద్, వాలీబాల్ పోటీల్లో ఐ.చైతన్య ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అకడమిక్ డైరెక్టర్లు ఆర్. వీర్రాజు చౌదరి, ఆర్.ఉమాదేవి, హెచ్‌ఎం ఎం. చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక


జిల్లా క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

మండపేట: మండలంలోని వెలగతోడు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో జరిగిన అండర్-14, అండర్- 17 క్రీడా పోటీల్లో తమ సత్తాను చాటి జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోట్ర లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తమ పాఠశాల చదువుకుంటున్న విద్యార్థులు 21 మంది జిల్లా స్థాయి క్రీడలకు ఎంపకయ్యారని తెలిపారు. అదేవిధంగా గత రెండు రోజులుగా ఏడిద, రాయవరం హైస్కూలులో జరిగిన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈవోలు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డిలు అభినందించారు. మరింత శక్తి సామర్థ్యాలతో జిల్లా స్థాయిలో కూడా ఎదిగి ప్రతిభను చాటాలని బోధించారు. పాఠశాల పీడీ మానుపూడి సహదేవుడు, గ్రామ సర్పంచ్ నలమామిడి కృపరాజు, ఎస్ఎంసీ చైర్మన్ రెడ్డి సురేష్, వైస్ చైర్మన్ పిల్లెల మమత, తదితరులు విద్యార్థులను అభినందించారు.

జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

కాజులూరు: మహాత్మ జ్యోతిరావు పూలేను యువత ఆదర్శంగా తీసుకోవాలని డాక్టర్ శీలామంతుల వీరభద్రరావు సూచించారు. పూలే సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి 147 సంవత్సలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం గొల్లపాలెంలో జ్యోతీరావుపూలే విగ్రహానికి వీరభద్రరావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వెనుకబడిన వర్గాల సంక్షేమానికి జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే సేసిన సేవలను కొనియాడారు. అనంతరం సీనియర్ బీసీ సిటిజన్లను శెట్టిబలిజ సంక్షేమ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల శెట్టిబలిజ సంక్షేమ సంఘ నాయకుడు మేడిశెట్టి శ్రీరాములు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ

అంబాజీపేట: తైక్వాండో పోటీల్లో అంబాజీపేట శ్రీనివాస తైక్వాండో క్లబ్ క్రీడాకారులు ప్రతిభ చాటారని సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 26న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-14, 17 స్కూల్ గేమ్స్ జరిగాయి. ఇందులో అండర్-14లో ఎం.మౌనిక, బి.హేమరితిక్, అండర్-17 విభాగంలో పి.చరణ్యశ్రీలు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారని త్రిమూర్తులు వివరించారు. వచ్చే నెల 6 నుంచి 8 వరకూ తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ఈ ముగ్గురు క్రీడాకారులు పాల్గొనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్‌ఎం కడలి సాయిరామ్, పీడీ కె.ఆదిలక్ష్మి, పీఈటీ ఎ.సూర్యకుమారి, తైక్వాండో రిఫరీలు కె.లక్ష్మీప్రసన్న, పి.భార్గవిశ్రీకళ, కోచ్‌లు పి.మణికంఠ, కె.కుమారి అభినందించారు.


రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కోచ్

పచ్చదనం పరిశుభ్రతే లక్ష్యం కావాలి

మండపేట: పచ్చదనం పరిశుభ్రతే లక్ష్యంగా మున్సిపల్ అధికారులు పని చేసి ప్రజలకు ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని అందించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన స్వచ్ఛత హీ సేవా 2024 కార్యక్రమాలను మండపేటలో చేపట్టారు. గత రెండు రోజులుగా ముమ్మరంగా సాగుతున్న పూడిక తీత పనులను శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్ల, చైర్‌పర్సన్ దుర్గారాణి పరిశీలించారు. ఆలమూరు రోడ్డు, 19వ వార్డు డొక్కా సీతమ్మ స్త్రీ శక్తి భవన్ ఖాళీ స్థలం, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా పాత పార్కును శుభ్రం చేస్తున్న పనులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు బొక్కా సరస్వతి, మందపల్లి రవికుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కమిషనర్ రంగారావు, డిఈ కే శ్రీనివాస్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, సిబ్బంది చుండ్రు రామకృష్ణ, పాలచర్ల లీలాకృష్ణ పాల్గొన్నారు.


గుమ్మిలేరు రోడ్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, చైర్‌పర్సన్ దుర్గారాణి

ప్రమాదకరంగా వంతెన


మల్లవరంలో అప్రాచ్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారిన వంతెన

కె.గంగవరం: మండలంలోని కూళ్ల గ్రామ పంచాయతీ శివారు మల్లవరం వద్ద ఉన్న వంతెనకు అప్రాచ్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఇక్కడ సుమారు ఐదేళ్ల క్రితం నాబార్డు నిధులతో నూతన వంతెన నిర్మించారు. అప్పట్లో నాసిరకం కంకర వాడడం వల్ల కొంత వరకూ అప్రాచ్ కొట్టుకుపోయింది. మిగిలిన సగం ఇటీవల కురిసిన వర్షాలకు పంట కాలువలోకి కొట్టుకుపోయింది. వంతెనకు అప్రాచ్ లేకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనకు అప్రాచ్ నిర్మించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన


వెల్లలో రోడ్ల నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల గ్రామంలో సుమారు రూ.2.53 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. వెల్ల నుంచి కందులపాలెం వయా వెల్లసావరం, ద్రాక్షారామ, వెల్లసావరం వయా ఆదివారపుపేట, యనమదల గ్రామం నుంచి నరసాపురపుపేట వరకూ ఏపీఏఎం నిధులతో రోడ్లు నిర్మించనున్నారు. గత ప్రభుత్వంలోనే ఈ నిధులు మంజూరు కాగా కాంట్రాక్టరు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, సర్పంచులు వీరబోయిన సూరిబాబు, కొత్తపల్లి అరుణ, పంపన వీరవెంకటరమణ, ఎంపీటీసీలు చిక్కాల స్వామి కాపు, మంచెం దేవి, గుత్తుల అచ్యుతవేణి, నురుకుర్తి శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శీలం గోవిందు మృతికి సంతాపం

కపిలేశ్వరపురం: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శీలం గోవిందు మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు చుండ్రు చిట్టిబాబు, వైస్ ఎంపీపీలు గుణ్ణం భాను ప్రసాద్, సాకా శ్రీనివాస్, పలు గ్రామాల సర్పంచులు వీధి వెంకటరెడ్డి, గూటం శ్రావణి, తిరునాతి ఆదిలక్ష్మి, వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు యర్రంశెట్టి నాగేశ్వరరావు, శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆ కాలనీలకు దారేదీ?

- పద్దెనిమిదేళ్లుగా వెంటాడుతున్న మౌలిక వసతుల లేమి
- జనుపల్లి న్యూ, చీకట్లపాలెం ఇందిరమ్మ కాలనీలకు తప్పని తిప్పలు

అమలాపురం రూరల్: ప్రభుత్వం నిరుపేదలకు రూ.కోట్లు ఖర్చు చేసి భూములు కొని, కాలనీలు ఏర్పాటు చేసి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అధికారులు కాలనీలకు వెళ్లడానికి దారి ఏర్పాటు చేయకపోడంతో 18 ఏళ్లగా కాలనీల వాసులు దారిలేక ఇబ్బందులు పడుతున్నారు. దారి కోసం ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం చూపకపోవడం కాలనీలవాసులకు అవస్థలు తప్పడం లేదు. అమలాపురం మండలం జనుపల్లిలో రెండెకరాల భూమిలో 2007లో అప్పటి ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి 182 మందికి అమలాపురం పట్టణ వాసులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. కాలనీలకు అప్పట్లో అధికారులు రహదారి సదుపాయం కల్పించలేదు. ఈ కాలనీలో సుమారు 82 ఇళ్లు బేసిమెంట్ లెవెల్‌లో నిలిచిపోగా, 100 ఇళ్ల స్థలాల వరకూ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. ఈ పట్టాల్లో కొందరు ఇళ్లు నిర్మించుకున్నప్పటికీ కాలనీలకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. కలెక్టర్ కార్యాలయానికి కూత వేట దూరంలో ఉన్న ఈ దారి లేని జనుపల్లి కాలనీ వాసులు గత 18 ఏళ్లగా రోడ్డు, తాగునీరు, మౌలిక వసతులకు దూరంగా ఉండటంతో కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దారి కోసం ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా.. ఇంతవరకు సమస్యకు పరిష్కారం చూపలేదని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కాలనీవాసులు కలెక్టర్ ఆఫీస్ వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ముగ్గురు ఆర్డీవోలు, ముగ్గురు తహసీల్దార్లు సంఘటన స్థలాన్ని వచ్చి చూసినప్పటికీ పరిష్కార మార్గం చూపలేదు. కొంతమంది రైతులు పొలాల్లో నుంచి దారి ఇవ్వడానికి అభ్యంతరం చెబుతున్నారు. ఇప్పటి వరకు 12 సార్లు కలెక్టరేట్‌లో వినతిపత్రాలు ఇచ్చినా సమస్యల పరిష్కారం జరగలేదని కాలనీ వాసులు చెబుతున్నారు. వర్షాకాలంలో కాలనీ మంపుబారిన పడటంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రైతుల పొలాలో మంపు నీటిలో నడచి వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.


వర్షపునీటిలో ఇబ్బందులు పడుతు విద్యార్థులను పాఠశాలకు తీసుకుని వెళ్లుతున్న కాలనీవాసి (ఫైల్)

చీకట్లపాలెం ఇందిరమ్మ కాలనీకి ఇదే దుస్థితి

ఉప్పలగుప్తం శివారు చీకట్లపాలెం ఇందిరమ్మ కాలనీ ఏర్పడి 18 ఏళ్లయినా ఇప్పటివరకూ కాలనీకి రాకపోకలకు సరైన మార్గం, రోడ్డు, డ్రైనేజీలు, కుళాయిలు, కరెంటు, వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయలేదని కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసిందంటే చుట్టుపక్కల రైతుల పొలాల్లో వరద నీటిలో నడుచుకుంటూ ఇళ్లకు వెళ్లవలసి వస్తుందన్నారు. కాలనీలో మహిళలు, పాఠశాల విద్యార్థులు గృహాల నుంచి బయటకు వెళ్లాలన్నా.. రావాలన్న నానాపాట్లు పడుతున్నారని ఇటీవల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అధికారులకు కాలనీవాసులు వినతిపత్రం అందించారు. 2007లో ప్రభుత్వం ఇందిరమ్మ గ్రామంగా ఎంపిక చేసి నివాస స్థలాలు లేని 35 మంది నిరుపేదలకు గ్రామంలో సర్వే నంబర్ 361/ 9,10,11లో 1.08 ఎకరాల భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసి ఒక్కో లబ్ధిదారునికి రెండు సెంట్ల స్థలం చొప్పున లేఅవుట్ చేసి పట్టాలు ఇచ్చారు. అందులో కొంతమంది పక్కా గృహాలు, కొంతమంది పూరిపాకలు వేసుకుని నివాసం ఉంటున్నారు. కాలనీలో కనీసం రాకపోకలకు దారి, రోడ్లు, తాగునీరు వంటి వసతులు లేకపోవడవంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆశపు సత్యవేణి, చీకట్ల నాగబాబు, వరచర్ల వెంకటేశ్వరరావులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇబ్బందులు పడుతున్నాం



కాలనీకు దారిలేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో ముంపునీటిలో వెళ్లవలసి వస్తుంది. వృద్ధులు, చిన్నారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇళ్లలో పాములు రావడంతో భయపడుతున్నాం. అధికారులు సౌకర్యాలు కల్పించాలి

– నాగమగిరి వెంకటలక్ష్మి, జనుపల్లి న్యూకాలనీ, అమలాపురం

అధికారులు దయ చూపాలి



తమ కాలనీ సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవాలి. 18 ఏళ్లగా అనేక అవస్థలు పడుతున్నాం. కాలనీలో రోడ్డు, డ్రైనేజీలు కుళాయిలు, కరెంటు, వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ దయ చూపి సమస్యలు పరిష్కరించాలి.

– అల్లాడ రమేష్, జనుపల్లి న్యూకాలనీ, అమలాపురం